# ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి జీవన భృతి కల్పించాలని డిమాండ్
- జిల్లాలో ఆటోడ్రైవర్ల నిరసనలు

కామారెడ్డి/బాన్సువాడ/భిక్కనూరు, డిసెంబర్ 15 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డామని, తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆటో డ్రైవర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంతో తాము ఉపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వంద నుంచి రెండు వందల రూపాయలు మాత్రమే వస్తున్నాయని అన్నారు. తమకు జీవన భృతి కింద నెలకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము ఆటోలను ఫైనాన్స్‌కు తీసుకొని ఈఎంఐ కట్టుకోలేని దుస్థితి వచ్చిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్‌లో ఆటోవాలాలు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హైదర్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆటోడ్రైవర్లు నిరసన చేపట్టారు.



కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న ఆటో యూనియన్ సభ్యులు



పెద్దమల్లారెడ్డి లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు



బీర్కూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

## సమయ పాలన పాటించని ఉద్యోగులు



రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

బీబీపేట, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి ఉదయం 10: 40 గంటలైనా రెవెన్యూ ఉద్యోగులు చేరుకోలేదు. ఉద్యోగులు సమయ పాలన పాటించకుండా తమ ఇష్టానుసారం కార్యాలయానికి వచ్చి.. వెళ్తుండంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం మండలంలోని గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ స్లాట్ బుకింగ్ 10 గంటలకు ఉండగా వారి రిజిస్ట్రేషన్ అయ్యేందుకు గంటల కొద్దీ సమయం పడుతుందని వాపోతున్నారు. కొందరు సిబ్బంది మధ్యాహ్నం వచ్చి కొంత సేపు కాలయాపన చేసి మళ్లీ భోజన విరామం అంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరి కొందరు పని ఉండడంతో ఉదయం 9 గంటలకే కార్యాలయానికి వచ్చేశారు. వారిలో బీబీపేట ఆర్ఐ అజయ్, రికార్డు అసిస్టెంట్ విజయ్, సహాయకులుగా అటెండర్ బాల్‌రాజు, రాజయ్య ఉన్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో సహ జూనియర్ అసిస్టెంట్లు మిగతా సిబ్బంది సమయపాలన పాటించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నాలుగు టిప్పర్లు, రెండు పొక్లెయిన్ల సీజ్

నస్రుల్లాబాద్, డిసెంబర్ 15 : మండలంలోని నాచుపల్లి తండా గ్రామ శివారులో శుక్రవారం అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు పొక్లెయిన్లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ రాజు తెలిపారు. మండలంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



బీర్కూర్‌లోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

బాన్సువాడ, డిసెంబర్ 15 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ రఘు అన్నారు. బీర్కూర్‌లోని ఉన్నత పాఠశాలను ఆయన ఎంపీడీవో భానుప్రకాశ్‌తో కలిసి శుక్ర వారం సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం కూరగాయలు పెట్టకుండా నీళ్లచారు, సాంబారు అందించడంతో విద్యార్థులు ఇంటి నుంచి లంచ్‌బాక్సులు తెచ్చుకుంటున్నారని తెలిసి సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడకని అన్నం పెడుతున్నారని, ఆ అన్నం తింటే కడుపు నొప్పుందని విద్యార్థులు వాపోయారు. అందుకే ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నట్లు అధికారులకు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి, డిసెంబర్ 15 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 9వ జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ సెలక్షన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23వ తేదీన కామారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి హాజరయ్యారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో రాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రసూల్, అతీఖుల్లా, దత్తు, నవీన్, మధుసూదన్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, శివాగౌడ్, భాస్కర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

తాడ్వాయి, డిసెంబర్ 15: మండలంలోని క్రిష్ణాజివాడి ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాల ఆవరణలో సర్పంచ్ భూషణం, హెచ్ఎం రామస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఎనిమిది సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా పని చేసిన ఉపాధ్యాయులు వేణుగోపాల్, రమేశ్, రాజేందర్, రవీందర్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతాబాయి నారాయణరావు, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయుడు గిర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ తరగతులతో విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు



డిజిటల్ బోర్డుపై తరగతులను బోధిస్తున్న అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 15 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు డిజిటల్ తరగతులు ఎంతగానో దోహదపడుతాయని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. దేశాయిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన పెంపొందించేలా తయారు చేసిన దాదాపు 30 మ్యాథ్స్, సైన్స్ మాడ్యూల్స్‌ను డిజిటల్ బోర్డుపై శుక్రవారం విద్యార్థులకు బోధించారు. విద్యార్థుల్లో గణితం, సైన్స్‌పై భయాందోళనను దూరం చేసేలా ఉపాధ్యాయులు సరళ పద్ధతిలో బోధించేందుకు కృషి చేయాలన్నారు. అగస్త్య ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్ శంకర్, ఉపాధ్యాయులు నరేందేర్, సుంక్యా, శంకర్, విష్ణు, అమర్‌సింగ్, శ్రీనివాస్, సుభాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



అక్కాపూర్‌లో బడి బయట పిల్లలతో సీఆర్పీ

బాన్సువాడ రూరల్/మాచారెడ్డి, డిసెంబర్ 15 : బడీడు పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా బడికి పంపించాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సుదర్శన్ అన్నారు. బడిబయట ఉన్న పిల్లల కోసం చేపట్టిన సర్వేలో భాగంగా మండలంలోని కిష్యానాయక్ తండాలో శుక్రవారం పర్యటించి బడిబయట ఉన్న పిల్లలను గుర్తించారు. బడిమానేసిన ఇద్దరిని గుర్తించి బడిలో చేర్పించారు. బడీడు పిల్లలను దుకాణాల్లో జీతం ఉంచడం నేరమని అన్నారు. ప్రజాప్రతినిధులు సైతం చొరవ తీసుకొని బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు సహకరించాలని ఆయన కోరారు. మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్, తడ్కపల్లి గ్రామాల్లో సీఆర్పీ దేవసంజీవ్ సర్వే నిర్వహించారు. అక్కాపూర్‌లో ఇటుక బట్టీవద్ద పని చేస్తున్న మహారాష్ట్ర వలస కార్మికుల పిల్లలను గుర్తించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

## దివ్యాంగులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య

కామారెడ్డి, డిసెంబర్ 15 : దివ్యాంగులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి బావయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని తెలిపారు. దివ్యాంగులు స్వయం ఉపాధి రంగాలు ఏర్పాటు చేసుకొని, మరో 10 మందికి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేశారు. దివ్యాంగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా భవిత కేంద్రం సమన్వయకర్త శ్రీపతి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఐకేపీడీపీఎం రమేశ్‌బాబు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు బాల్ రెడ్డి, దుర్గా ప్రసాద్, పోచవ్వ, హరిసింగ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.